క్లుప్తంగా

ట్రామా కేసులో ప్రతీ నిమిషం విలువైనదే



మాట్లాడుతున్న వైద్యులు

జగిత్యాల: ట్రామా కేసులో ప్రతి నిమిషం విలువైనదేనని, సెకెన్లలో తీసుకునే వేగవంతమై నిర్ణయం రోగి ప్రాణాలు కాపాడుతుందని కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి ఎమర్జెన్సీ ఫిజీషియన్ సత్యనారాయణ అన్నారు. జగిత్యాలలో వరల్డ్ ట్రామా డే సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ట్రామా డే సందర్భంగా ప్రజల్లో ప్రమాదాలపై అవగాహన పెంపొందించడం, రోడ్డు భద్రత నియమాలను పాటించడం, ప్రమాదాలు జరిగిన వెంటనే ఆలస్యం చేయకుండా వైద్య సహాయం పొందడం ఎంతో ముఖ్యమని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యూరో సర్జన్ రాజీవ్‌రెడ్డి, క్రిటికల్ కేర్ నిపుణులు ఉపేందర్‌రెడ్డి, ఆర్థోపెడిక్ సర్జన్లు వేణుగోపాల్, రాకేశ్, మెడికవర్ నిర్వాహకులు గుర్రం కిరణ్, మేనేజర్ కరుణాకర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కండ్లపల్లి చెరువుకట్ట పరిశీలన



చెరువుకట్టను పరిశీలిస్తున్న అధికారులు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి చెరువు ప్రమాదం పొంచి ఉండటంతో ఇటీవల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మాజీమంత్రి జీవన్‌రెడ్డిలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో శుక్రవారం రిటైర్డ్ ఎస్‌ఈ రామరాజు, సేఫ్టీ అధికారి జయలక్ష్మీ, నీటిపారుదల శాఖ ఈఈ ఖాన్, జియాలజిస్ట్ పద్మరాజు బృందం కట్టను పరిశీలించింది. కట్టకు ఎలాంటి ప్రమాదం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మరమ్మతులపై చర్చించారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న మురళి

జగిత్యాల: సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ అధికారి మురళి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థినీ విద్యార్థులు టెక్నాలజీ వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని, అపరిచితుల నుంచి వచ్చిన లింకులు ఓపెన్ చేయకూడదని, ఒకవేళ సైబర్ క్రైమ్ జరిగితే వెంటనే 1930కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, బ్లూకోర్ట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఆర్‌పై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

జగిత్యాల: సీపీఆర్‌పై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్‌ఆర్ మహిళ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీపీఆర్ పట్ల అవగాహన ఉంటే ఎవరైనా కార్డియాక్ అరెస్ట్ అయినప్పుడు వ్యక్తి ప్రాణాలు కాపాడవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు వీటి పట్ల అవగాహన ఉండాలన్నారు.

విద్యార్థులకు అవగాహన

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని పురాణిపేట పాఠశాలలో విద్యార్థులకు పోలీసు పాఠశాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ కరుణాకర్ మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్‌పై చిన్నప్పటి నుంచే అవగాహన కలిగి ఉండి రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. ప్రతీ వాహనదారుడు బాధ్యతాయుతంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై మల్లేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

దర్జాగా రహదారుల కబ్జా

- చోద్యం చూస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు
- ఇరుకు రోడ్లతో ప్రయాణికుల అవస్థలు



కోరుట్ల-సంగెం రోడ్డులో రహదారిని ఆక్రమించి వేసిన పెట్రోల్ బంక్ పార్కింగ్ టైల్స్

కోరుట్ల రూరల్: మండలంలోని ఆర్‌అండ్‌బీ రోడ్ల పక్కన మట్టి రోడ్డును కమర్షియల్ అవసరాల కోసం యథేచ్ఛగా ఆక్రమిస్తుండటంతో ఇరుకు రోడ్లపై ప్రయాణికులకు అవస్థలు తప్పటం లేదు. పలు చోట్ల బీటీ రోడ్డు వరకూ ఆక్రమిస్తుండటంతో ఎదురెదురుగా పెద్ద వాహనాలు వచ్చినప్పుడు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారుల నిబంధనల ప్రకారం రోడ్డు మధ్య నుంచి ఇరువైపులా 30 ఫీట్ల వెడల్పు బీటీ, రెండు వైపులా 1.5 మీటర్ల మట్టి రోడ్డు ఉండాల్సి ఉంది. కాగా మట్టి రోడ్డు ఎక్కడా కూడా 1.5 మీటర్ల వెడల్పు ఉండటం లేదు. రోడ్డు పక్కన గల ఫ్యాక్టరీలు, రైసుమిల్లులు, పెట్రోల్ బంకులు, ఫంక్షన్ హాల్స్,కట్టె మిల్లులు మట్టి రోడ్డును ఆక్రమించి నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నా సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండటంతో ఆక్రమణదారులు యథేచ్ఛగా నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. పలు చోట్ల దుకాణ సముదాయాలు కూడా మట్టి రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. నిర్మాణాల ముందు ఎలాంటి డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టకపోవటంతో వర్షాకాలం వరదల కారణంగా వరద నీళ్లు రోడ్లపై చేరి రోడ్డు కోతకు గురవుతున్నాయి. రోడ్ల ఆక్రమణలపై ప్రయాణికులు అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఆక్రమణలకు గురైన కమర్షియల్ ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చీఫ్ జస్టిస్‌పై దాడిచేసిన వ్యక్తిని శిక్షించాలి



జగిత్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎంఎస్పీ నాయకులు

జగిత్యాలరూరల్: చీఫ్ జస్టిస్‌పై దాడిచేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం అన్నారు. శుక్రవారం జగిత్యాల రూరల్ తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడికి పాల్పడ్డ అడ్వకేట్ రాకేశ్ కిశోర్‌ను అరెస్ట్ చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ దళితుడు కావడం వల్లే ఈ దాడి జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సురుగు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బొల్లె అనిల్, నాయకులు పాల్గొన్నారు.

నిందితుడిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

రాయికల్: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై బూటు విసిరి దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం డిమాండ్ చేశారు. శుక్రవారం రాయికల్ తహసీల్ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ నాగార్జునకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాలెపు బాలరాజు, లింగంపల్లి రాజేశ్, హరీశ్, శేఖర్, దిలీప్, వెంకటేశ్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పక పాటించాలి

కోరుట్ల రూరల్: పాఠశాల మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పక పాటించాలని ఎంపీడీవో ఓదెల రామకృష్ణ అన్నారు. పట్టణంలోని హాజీపూరలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఎంపీడీవో సహపంక్తి భోజనం చేశారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నిశత్ అంజుమ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులు కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర పొందాలి

ఇబ్రహీంపట్నం: రైతులు మొక్కజొన్నలను కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని తహసీల్దార్ వరప్రసాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగాం రాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు, వైస్ చైర్మన్ ఎలాల వెంకట్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బద్దం గోపి, వైస్ చైర్మన్ జిల్లాల పవన్, ఏవో రాజ్‌కుమార్, మార్కెట్ కార్యదర్శి సురేందర్, సింగిల్‌విండో కార్యదర్శి మంత్రి సతీస్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గూడ శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నూకపల్లిలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

మల్యాల: మండలంలోని నూకపల్లిలో శుక్రవారం జగిత్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహమ్మద్ ఇబ్రహీం జ్ఞాపకార్థకంగా ఏఈడీ ఎండీ.ఉస్మాన్, ఎండీ.అబ్దుల్ అజీజ్ శుక్రవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 120మందిని పరీక్షించి, 55 మందిని కంటి ఆపరేషన్ కోసం రేకుర్తికి తరలించారు. కార్యక్రమంలో తాటిపాముల వినోద్, శ్రీరాముల సుదర్శన్, వడ్లగట్ల శంకర్, గుండేటి గంగాధర్, సామల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల బలోపేతానికి సహకారం అభినందనీయం

మల్లాపూర్: ప్రభుత్వ కళాశాల బలోపేతానికి సహకారం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ బండి సత్యనారాయణ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రాఘవపేటకి చెందిన కుడుక దేవారెడ్డి రూ.13 వేల విలువ గల ప్రొజెక్టర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలకు దాతలు అన్నిరకాల సంపూర్ణ సహాయ సహకారాలు అందించాలని కోరారు. దాత కుడుక దేవారెడ్డి అందించిన ప్రొజెక్టర్‌తో కళాశాలలో చదివే విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులను నిర్వహించేందుకు తోడ్పడుతుందన్నారు. అనంతరం కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు క దేవారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నంచర్ల రాజేశ్, శ్రీనివాస్, రాజేందర్, సంతోష్‌కుమార్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

వెల్గటూర్ : రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని మార్కెట్ కమిటీ చైర్మన్ గుండాటి గోపిక అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద మద్దతు ధరల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పత్తికి ప్రభుత్వం 8110/– మద్దతు ధర కల్పించిందని, ఆరుగాలం పండించిన పంటను రైతులు బయట మార్కెట్‌లో అమ్మి మోసపోవద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోళ్ల తిరుపతి, పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

పెగడపల్లి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని ఎంపీడీవో శశికుమార్‌రెడ్డి లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని నంచర్లలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్లను ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములుగౌడ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్లుల మంజూరుకు ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రజనికాంత్, ఎడ్ల శ్యాంసుందర్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం కల్లెడ, లక్ష్మీపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని కల్లెడ, తక్కళ్లపల్లి, సోమన్‌పల్లి, సంగంపల్లి, హబ్సీపూర్, గుట్రాజ్‌పల్లి, అనంతారం, లక్ష్మీపూర్, జాబితాపూర్, ధర్మారం, తిమ్మాపూర్ గ్రామాల్లో శనివారం సాయంత్రం 3.30 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఏఈ సుందర్ తెలిపారు.

మల్యాల మండలంలో..

మల్యాల: మండలంలోని తక్కళ్లపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని తక్కళ్లపల్లి, మానాల, మ్యాడంపల్లి గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏఈ దయానంద్ తెలిపారు. తాటిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని తాటిపల్లి, లంబాడిపల్లి గ్రామాల్లో మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 4.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని పేర్కొన్నారు.

ఓటు చోరీపై సంతకాల సేకరణ

కోరుట్ల రూరల్: కోరుట్ల మున్సిపల్ విలీన గ్రామం యెఖీన్‌పూర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓటు చోరీపై శుక్రవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓటు చోరీతోనే రెండు సార్లు అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయాలి

సారంగాపూర్: ఎరువుల నిల్వలపై స్టాక్‌బోర్డులను ఏర్పాటు చేయాలని బీర్‌పూర్ మండల వ్యవసాయాధికారి ఎస్. తిరుపతి అన్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లా వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయాధికారి (టెక్నికల్ విభాగం)లో విధులు నిర్వహించి బీర్‌పూర్ మండల ఏవోగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం కొల్వాయి సొసైటీలో ఎరువుల నిల్వలను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించి వరి కోతల విషయంలో పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఏఈవోలు ఆయోరి వినోద్, శిరీష, కొల్వాయి సొసైటీ సీఈవో రాజేందర్, రైతులు ఉన్నారు.

ఆంజనేయ స్వామికి మాజీ మంత్రి పూజలు

గొల్లపల్లి: మండలంలోని అగ్గిమల్ల భక్తాంజనేయ స్వామి దేవాలయ నవగ్రహ, ధ్వజ స్తంభ యంత్ర ప్రతిష్ఠ, కలశ స్థాపన, శ్రీ సీతారామచంద్ర స్వామి ఉత్సవమూర్తి, కలశ స్థాపన, ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులు, అనర్హుల జాబితా విడుదల చేస్తాం

జగిత్యాల: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మధ్యాహ్నం 2 గంటల తర్వాత అన్ని వార్డుల్లో డబుల్ బెడ్ రూంలకు సంబంధించి రెవెన్యూ, హౌసింగ్ డిపార్ట్‌మెంట్ వారు రూపొందించిన అర్హులు, అనర్హుల జాబితాను విడుదల చేస్తామని మున్సిపల్ కమిషనర్ స్పందన తెలిపారు. జాబితాను ప్రదర్శించి, అభ్యంతరాలు స్వీకరిస్తామని వార్డు సభలకు మొన్న రాని వారు కూడా లిస్ట్ తీసుకుని తమ అభ్యంతరాలు తెలపాలని, అన్ని వార్డుల్లో సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

ప్రత్యేక ఆధార్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

కోరుట్ల: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో గంగుల నరేశం అన్నారు. ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఎంఈవో శుక్రవారం పరిశీలించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఆధార్‌లో మార్పులు చేయించుకోవాలని సూచించారు. విద్యార్థులు బయోమెట్రిక్ అప్‌డేట్, ఆధార్ కార్డు లేని విద్యార్థులకు కొత్త ఆధార్ కార్డు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు.కార్యక్రమంలో హెచ్‌ఎం గంగాధర్‌పాల్గొన్నారు.

గురుకుల కళాశాల సందర్శన

మేడిపల్లి: మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ కళాశాల (బాలుర) విద్యార్థులతో జగిత్యాల జిల్లా లోకల్‌బాడీస్ కలెక్టర్ రాజాగౌడ్ సమావేశమయ్యారు. కళాశాల వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. వంటగది, భోజనశాలను పరిశీలించారు. అనంతరం మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు.

ఈజీఎస్ బిల్లులు మంజూరు చేయాలని వినతి



మంత్రి సీతక్కను కలిసిన ఎమ్మెల్యే

జగిత్యాల: జగిత్యాల నియోజకవర్గంలో పూర్తయిన ఈజీఎస్ పనుల బిల్లులను త్వరితగతిన మంజూరు చేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ శుక్రవారం పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం సమర్పించారు. బిల్లులు రాకపోవడంతో ఇబ్బందికరంగా ఉందని, వెంటనే మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలోని నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలన్నారు. స్పందించిన మంత్రి సీతక్క బిల్లుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం

- ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధి ఏది?
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

జగిత్యాల: బెస్ట్ అవేలబుల్ స్కూళ్లలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఫీజులు చెల్లించకపోవడంతో, వారి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోందని, సోషల్ వెల్ఫేర్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఏం చేస్తున్నారని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రశ్నించారు. జగిత్యాలలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ.. సంక్షేమశాఖ మంత్రిగా లక్ష్మణ్‌కుమార్ పరిధిలోకే బెస్ట్ అవేలబుల్ స్కూల్స్ వస్తాయని, ఎన్నడూ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ప్రభుత్వం బెస్ట్ అవేలబుల్ స్కూళ్లకు రూ.220 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని, ప్రైవేటు గురుకులాలకు రూ.215 కోట్ల బకాయిలు ఉందన్నారు. గురుకులాల్లో కోడిగుడ్లు, చికెన్, మటన్ సరఫరా చేసే వారికి బిల్లులు రాకపోవడంతో సరఫరా నిలిచిపోయిందన్నారు. ధర్మపురిలో ఇప్పటి వరకు కనీసం తట్టెడు మట్టి కూడా పోయలేదని మండిపడ్డారు. దావ వసంత, శ్రీకాంత్‌రెడ్డి, హరిచరణ్‌రావు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తులు



ఏఐసీసీ జిల్లా ఇన్‌చార్జిని సన్మానిస్తున్న నర్సింగరావు

కోరుట్ల/రాయికల్/కథలాపూర్: జగిత్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవి కోసం కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు దరఖాస్తు చేసుకున్నారు. ఏఐసీసీ జగిత్యాల జిల్లా ఇంచార్జి జయకుమార్ కు శుక్రవారం దరఖాస్తు పత్రాన్ని సమర్పించారు. ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు చెరుకు సమ్మయ్య డీసీసీ అధ్యక్ష పదవి దరఖాస్తు చేసుకున్నారు. రాయికల్ పట్టణానికి చెందిన మహిళా న్యాయవాది అల్లె వనిత శుక్రవారం డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకున్నారు. కథలాపూర్ మండలం చింతకుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు చెదలు సత్యనారాయణ కూడా శుక్రవారం దరఖాస్తు సమర్పించారు. బీసీ అయిన తనకు అవకాశం ఇవ్వాలని కోరారు.

గోదావరి నుంచి అక్రమంగా ఇసుక రవాణ



గోదావరి లో ట్రాక్టర్‌లో నింపుతున్న ఇసుక

ఇబ్రహీంపట్నం: గోదావరి నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. మండలంలోని కోమటి కొండాపూర్‌లో గోదావరి వద్ద వరద ఉధృతి తగ్గడంతో ఇసుక అక్రమ రవాణాదారులు జోరుగా ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒక ట్రిప్పుకు రూ.4000 వేలు తీసుకుని అనుమతి లేకుండా ఇసుకను అమ్ముకుంటున్నారు. ఇంత జరుగుతున్నా.. అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండడంతో ఇదే అదునుగా బావించి మూడు పువ్వులు, ఆరు కాయలుగా సంపాదిస్తున్నారు. అలాగే మల్లాపూర్ నుంచి రాఘవపేట లింకురోడ్డు మీదుగా వయా తిమ్మాపూర్ ద్వారా ఇసుక అక్రమ రవాణా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇసుక ట్రాక్టర్లు అధికారుల కంటబడకుండా తెల్లవారుజామున ట్రాక్టర్లతో రవాణా చేస్తూ సందుల గుండా వెళ్తూ ఇళ్ల వద్ద వద్ద పోస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చిట్టాపూర్‌లో ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మల్లాపూర్: మండలంలోని చిట్టాపూర్ శివారులో శుక్రవారం అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసు సిబ్బందితో దాడి చేసినట్లు తెలిపారు. ట్రాక్టర్‌ని పట్టుకుని కేసు నమోదు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బంద్ విజయవంతం చేయాలి

జగిత్యాల: బీసీ బంద్ విజయవంతం చేయాలని హరి అశోక్‌కుమార్ అన్నారు. బీసీ బంద్ సెగ ఢిల్లీని కదిలించాలని, కేంద్రం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మెట్‌పల్లి: రాష్ట్ర బంద్‌కు పట్టణంలో అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలిపాలని బీసీ జేఏసీ నాయకులు కోరారు. పట్టణంలో శుక్రవారం మాట్లాడారు. జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీలకు అందుకనుగుణంగా రిజర్వేషన్లు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.

మల్లాపూర్: బీసీ రిజర్వేషన్లకు తలపెట్టిన రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని 'బీసీ' జేఏసీ నాయకులు కోరారు. శుక్రవారం మల్లాపూర్ మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర కల్యాణ మండపంలో 'బీసీ' జేఏసీ ఆధ్వర్యంలో సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ నాయకులు మాట్లాడుతు బీసీ లకు చట్టబద్ధంగా 42శాతం రిజర్వేషన్లు వచ్చే వరకు ఐక్యంగా ఉద్యమిద్దామన్నారు. అన్ని వర్గాల ప్రజలు బంద్‌కు మద్దతు తెలపాలని కోరారు.

కథలాపూర్: రాష్ట్ర బంద్‌కు ప్రజలు సహకరించాలని బీసీ సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు జిల్లా రాజు కోరారు. మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యటించి మాట్లాడారు.పార్టీలకతీతంగా బంద్‌కు సహకరించాలన్నారు.

రాయికల్: బీసీల రిజర్వేషన్ కోసం వివిధ పార్టీల ఆధ్వర్యంలో శనివారం చేపట్టే బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు సామల్ల సతీశ్, యువజన సంఘం అధ్యక్షుడు మోత్కూరి శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు బండారి సాయిరాజ్‌గౌడ్‌లు కోరారు.

ఎమ్మార్పీఎస్ మద్దతు

ధర్మపురి : ఈనెల 18న తలపెట్టిన రాష్ట్రబందుకు ఎమ్మార్పీఎస్ నాయకులు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని మండలశాఖ అధ్యక్షుడు చెందోలి శ్రీనివాస్ అన్నాడు. ధర్మపురిలో శుక్రవారం మాట్లాడారు. కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఎమ్మార్పీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ఇబ్రహీంపట్నం: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీవో సలీం, తహసీల్దార్ వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో సలీమ్ మండలంలోని కోజన్‌కొత్తూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, తహసీల్దార్ వరప్రసాద్ తిమ్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు.కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శోభారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వెల్లుల జెడ్పీహెచ్‌ఎస్‌లో స్వచ్ఛత పక్వాడ నిర్వహించారు. దీనిలో భాగంగా శుక్రవారం స్వచ్ఛతా ప్రతిజ్ఞ నిర్వహించి,విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. . కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో విద్యార్థి ప్రతిభ

కథలాపూర్: నిజామాబాద్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలో కథలాపూర్ మాస్ట్రో హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి బండపల్లి శ్రీరాం ప్రతిభ చాటినట్లు హెచ్‌ఎం రంజిత్ శుక్రవారం తెలిపారు. శ్రీరాం రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి జాతీయస్థాయికి అర్హత సాధించాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థిని ఎంపిక

మల్యాల: మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థిని ఎం.దర్శిని అండర్-17 బాలికల వాలీబాల్ పోటీల్లో జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది.ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రిన్సిపాల్ మానస, పీఈటీ మధులిక అభినందించారు.

వెల్గటూర్ : వెల్గటూర్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు గజ్జెల శ్రీవిద్య, బోరె జాశ్విత్, బట్టు గ్రీష్మ ఎస్‌జీఎఫ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం చిప్ప నందయ్య తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఈ నెల 22న జరిగే ఉమ్మడి కరీంనగర్ జిల్లా పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ప్లాస్టిక్ మానవ మనుగడకు ప్రమాదం

జగిత్యాల:మానవ మనుగడకు ప్లాస్టిక్ ప్రమాదమని, నిత్యం జీవితంలో ఉపయోగించే అనేక రకాల వస్తువులను ప్లాస్టిక్ లేకుండానే రూపొందించుకోవచ్చని ఆర్‌కే విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ అన్నారు. శుక్రవారం కళాశాలలో ఏకో బజార్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పర్యావరణ హిత వస్తువులను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరేశ్, రాజేందర్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పెగడపల్లి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహేశ్వరి అన్నారు. మండలంలోని సుద్దపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం జాతీయ పౌష్టికాహారం మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలు, పౌష్టికాహారంపై సూపర్‌వైజర్ అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్ రజిత, ఆశా వర్కర్లు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.